సాక్షి
ప్రకాశం
ఆదివారం । 3 । ఆగస్టు । 2025



జగన్ 2.0లో కార్యకర్తలకే ప్రాధాన్యం

వైఎస్ జగన్ 2.0 పరిపాలనలో కార్యకర్తలకే ప్రాధాన్యమని ఎమ్మెల్యే బూచేపల్లి అన్నారు.

- 8లో..



భార్య గొంతు కోసిన భర్త

కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ భర్త భార్య గొంతు కోశాడు. ఈ ఘటన పెద్దదోర్నాల మండలం పెద్దబొమ్మలాపురంలో జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
38 /28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

క్రీడాపోటీలకు ఆరు రోజుల షెడ్యూలు

ఒంగోలు: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ నిర్వహించనున్న పది రకాల ఆటల పోటీలకు 6 రోజులు షెడ్యూలు ఖరారైంది. శనివారం స్థానిక మినీ స్టేడియంలో హాకీ, పీఈటీ అసోసియేషన్, బాస్కెట్ బాల్ అసోసియేషన్, ఒలింపిక్ అసోసియేషన్, కబడ్డీ, ఖోఖో, ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, అసోసియేషన్ల కార్యదర్శులు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శితో జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారి జి.రాజరాజేశ్వరి సమావేశమయ్యారు. తొలిరోజైన 5వ తేదీ హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ పోటీలు నిర్వహిస్తారు. 6వ తేదీ వాలీబాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్, బ్యాడ్మింటన్ క్రీడలు నిర్వహిస్తారు. ప్రకాశం జిల్లాకు సంబంధించిన 22 సంవత్సరాలలోపు స్త్రీ, పురుషులు వ్యక్తిగతంగా లేదా టీంగా పాల్గొన వచ్చు. పోటీల్లో పాల్గొనదలిచిన క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్‌కార్డుతో ఈనెల 5న ఉదయం 9 గంటలకు మినీ స్టేడియంలో హాజరు కావాలన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు సమావేశం అనంతరం జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి జి.రాజరాజేశ్వరి మీడియాకు వివరించారు. పోటీలకు సంబంధించి సెమి ఫైనల్, ఫైనల్ పోటీలను 5,6 తేదీల్లో ముగించలేని పక్షంలో లేదా వర్షం కారణంగా సమస్య వస్తే ఆ పోటీలను 7 నుంచి 10వ తేదీ మధ్య నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

మూడు నామినేషన్లు తిరస్కరణ

కొండపి: కొండపి పంచాయతీ సర్పంచ్, వార్డులకు నామినేషన్ దాఖలు చేసిన వాటిలో మూడు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవిబాబు తెలిపారు. సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు 15 మంది నామినేషన్‌లో వేశారని, వాటిలో ఎనమద్ని వసంత నామినేషన్ తిరస్కరణ గురైందన్నారు. అదేవిధంగా 9వ వార్డుకు ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ వేయగా ఒకరి నామినేషన్ తిరస్కరణ, ఆరో వార్డుకు ముగ్గురు నామినేషన్ వేయగా ఒకరి నామినేషన్ తిరస్కరించినట్లు పేర్కొన్నారు. తిరస్కరణకు గురైన అభ్యర్థులు ఆదివారం సాయంత్రం 5 గంటల లోగా రెవెన్యూ డివిజనల్ అధికారి వద్ద తిరస్కరణపై అప్పీల్ చేయవచ్చని చెప్పారు.

నేడు సబ్ జూనియర్స్ జిల్లా స్థాయి జూడో పోటీలు

ఒంగోలు: సబ్ జూనియర్స్ జిల్లా స్థాయి జూడో పోటీలు ఆదివారం స్థానిక మామిడిపాలెం చెరువు వద్ద ఉన్న యోగ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా అమెచ్యూర్ జూడో అసోసియేషన్ కార్యదర్శి ఎ.రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 ఏళ్ల వయస్సు దాటి 15 సంవత్సరాల్లోపు ఉన్న వారు మాత్రమే ఎంపికకు అర్హులు. ఈ పోటీలు వివిధ వెయిట్ కేటగిరీల్లో జరుగుతాయి. ఆసక్తిగల క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డు, పదో తరగతి మార్కుల జాబితా, రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలు వెంట తీసుకురావాలన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 9, 10 తేదీల్లో గుంటూరు జిల్లా పెదపరిమిలో జరిగే ముమ్మ చిన్న బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్టు నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

4న హెచ్‌ఎంలకు లీడర్షిప్ ట్రైనింగ్

ఒంగోలు సిటీ: ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు లీడర్షిప్ ట్రైనింగ్‌ను 3వ స్పెల్ ఈ నెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు 4 రోజులు పాదిలిలోని జోసఫ్ శ్రీహర్ష అండ్ మేరీ ఇంద్రజ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు డీఈఓ కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు మొత్తం 366 మంది ప్రధానోపాధ్యాయులు హాజరవుతున్నట్లు చెప్పారు. లిస్టులో ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలని డీఈఓ కోరారు.

బాబు ఫ్లాప్ షో

అన్నదాత సుఖీభవ డబ్బుల పంపిణీ పేరుతో సీఎం చంద్రబాబు నాయుడు సినిమా సెట్టింగ్‌ను తలపించేలా పంట పొలాల మధ్య..నులక మంచాలపై కూర్చొని మెడలో పచ్చ కండువాలు వేసుకున్న రైతుల మధ్య చేసిన కార్యక్రమం అట్టర్ ఫ్లాప్ అయింది. మండుటెండతో రైతులు మధ్యలోనే జారుకోగా.. టీడీపీ కార్యకర్తలతో సభను మమ అనిపించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించిన ఏ ఒక్క కొత్త హామీనీ ఇవ్వకుండా పాత హామీలనే వల్లెవేసిన బాబు తీరుపై అధికార పార్టీ కార్యకర్తల్లోనే అసంతృప్తి వ్యక్తమైంది.

- సీఎం పాల్గొన్న కార్యక్రమం అట్టర్ ఫ్లాప్ అవడంపై కార్యకర్తల్లో అసంతృప్తి
- మంచాలతో డ్రామా సెట్టింగులు
- పల్లె వాతావరణం తీసుకురావాలనే ప్రయత్నం బెడిసికొట్టిన వైనం
- ఇదేం కార్యక్రమమంటూ ముక్కున వేలేసుకున్న రైతులు, టీడీపీ కార్యకర్తలు
- ప్రసంగంలో దర్శి అభివృద్ధి ఊసే ఎత్తని చంద్రబాబు



కార్యకర్తలు ఎక్కి తొక్కడంతో విరిగిపోయిన మంచాలు



వాహనదారులను అడ్డుకుంటున్న పోలీసులు

దర్శి: బాబు వస్తారు..వరాల జల్లు కురిపిస్తారు అన్న ఆశతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి అన్నదాత సుఖీభవ మొదటి కార్యక్రమం దర్శి మండలం తూర్పువీరాయపాలెంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని వినూత్న రీతిలో ఖర్చు లేకుండా పేరు సంపాదించేలా ఉండాలని దర్శి టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. అధికారులు రెండు రోజులు భారీ ఎత్తున వచ్చి హడావిడి చేశారు. వచ్చే రైతులకు పాస్‌లు కూడా ఇచ్చి పంపారు. శనివారం ఉదయం 10 గంటలకు నాయకులు, కార్యకర్తలు వచ్చారు. వచ్చిన వారు అక్కడ చూసి ఖంగుతిన్నారు. అక్కడ అన్నీ నులక మంచాలే దర్శనం ఇచ్చాయి. ఒక్కటంటే ఒక్క కుర్చీ లేదు. టెంట్లు లేవు, ఎండకు ప్రజలు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు కూడా లేవు. పొలంలో ఎండలో కేవలం నులక మంచాలు మాత్రమే వేసి పెట్టారు. ఆ మంచాలపై టీడీపీ సానుభూతిపరులైన రైతులను కూర్చోబెట్టి ఆ ప్రోగ్రాం అయినా సక్సెస్ చేద్దామనుకున్న ప్రయత్నం విఫలమైంది.

మండుటెండలో మంచాలతో ప్రహసనం:
రైతులను ఆకుపచ్చ కండువాలు వేసి వారికి కేటాయించిన మంచాల పై కూర్చోబెట్టారు. అంత వరకు బాగానే ఉంది. పది గంటల నుంచి భానుడు భగ్గుమన్నాడు. ఆ ఎండకు మెడలో కండువాలు కాస్తా తలపైకి చేరాయి. ఎల్‌ఈడీ స్క్రీన్‌లో ప్రధాని మోదీ హిందీలో చెప్పున్న ప్రసంగాన్ని పెట్టడంతో జనానికి అర్థంకాక తలపట్టుకున్నారు. పైన టెంట్ లేకపోవడం , అక్కడ పూర్తి స్థాయిలో తాగునీరు లేకపోవడంతో వచ్చిన రైతులు, మహిళలు ఆ ఎండదెబ్బకు తట్టుకోలేక చల్లగా జారుకున్నారు. దీంతో మంచాలన్నీ ఖాళీ అయ్యాయి. ఆ తరువాత టీడీపీ అనుకూల రైతులకు పాస్‌లు ఇచ్చి పిలిచి కూర్చోబెట్టారు. వారు కూడా ఎండదెబ్బకు జారుకోవడం మొదలుపెట్టారు. దీంతో చంద్రబాబు వచ్చే సమయమైంది మంచాలు ఖాళీగా కనిపిస్తున్నాయని చెకింగ్ పాయింట్ తీసేసి కార్యకర్తలందరినీ వదిలేశారు. చంద్రబాబు, మంత్రులు, అధికారులు వచ్చి ఆయనతో పాటు మంచాల మీద కూర్చున్నారు. దీంతో వెనకున్న వారికి వచ్చిన వారు కనిపించలేదు. మంచాలపై కూర్చోకుండా నిలబడటం మొదలైంది. ఆ తరువాత ఒకరిని చూసి మరొకరు అందరూ మంచాలపై నుంచి లేచి నిలబడ్డారు. మంచాలు విరిగి తుక్కు తక్కు అయిపోయాయి. దీంతో మంచాల డ్రామా సెట్టింగ్ కాస్తా అట్టర్ ఫ్లాప్ అయింది.

ఒక్క హామీ ఇవ్వని వైనం
బాబు వస్తారు..వరాలు కురిపిస్తారు.. హామీలిస్తారని ఎదురుచూసిన కార్యకర్తలకు తీవ్ర నైరాశ్యం మిగిలింది. నియోజకవర్గానికి సంబంధించి ఒక్క హామీ ఇచ్చిన పాపాన పోలేదు. నియోజకవర్గంలో గత ఎన్నికలకు ముందు ఏవైతే హామీలు ఇచ్చారో అదే హామీలను మళ్లీమళ్లీ కొత్తగా ఇస్తున్నట్లు వల్లెవేశారు.

జిల్లాలో రైతులకు రూ.122.74 కోట్లు:
అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలో 2,68,165 రైతులకు రూ.122.74 కోట్లు, దర్శి నియోజకవర్గంలోని 42,871 మంది రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.29.06 కోట్ల నగదును పంపిణీ చేశామంటూ రైతులైన సుబ్బరత్తమ్మ, పేరయ్యలకు చెక్కు రూపంలో నగదును సీఎం అందజేశారు. దర్శి మండలంలో 10,987 మంది రైతులకు రూ.7.69 కోట్లు, తూర్పు వీరాయపాలెంలో 476 మంది రైతులకు రూ.7.20 కోట్లు నగదు ఇచ్చామన్నారు. ఉదయం 11.30 గంటలకు రైతుల వద్దకు వచ్చిన ముఖ్యమంత్రి దాదాపు రెండు గంటల పాటు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, టీడీపీ దర్శి ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసులు ఉన్నారు.

పోలీసుల ఆంక్షలతో ప్రజల ఇబ్బందులు

తాళ్లూరు: చంద్రబాబు సభకు రక్షణ పేరుతో పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కార్యక్రమాన్ని దర్శి–చీమకుర్తి ప్రధాన రహదారి మీద ఉన్న పంట పొలాల్లో నిర్వహించారు. రోడ్లు అన్నీ బ్లాక్ చేయడంతో రోజూ పంట సాగు చేసుకునే రైతులు, మేత కోసం పశువులను తోలుకుని వెళ్లే పాడి రైతులు ఇబ్బందులు పడ్డారు. అలాగే అత్యవసర పనిమీద దర్శి–చీమకుర్తి వెళ్లే వాహనదారులకు సరైన ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాట్లు చేయకపోవడంతో అవస్థలు పడ్డారు. కార్యక్రమానికి తరలి వచ్చిన వారికి, విధులు నిర్వహించిన ప్రభుత్వ అధికారులకు నీటి, భోజన సదుపాయాలు సరిగా అందలేదు.

నారపుశెట్టికి అవమానం

దర్శి నియోజకవర్గంలో టీడీపీకి పెద్ద దిక్కులా ఉన్న మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుకు, ఆయన సోదరుడు నగర పంచాయతీ చైర్మన్ నారపు శెట్టి పిచ్చయ్యకు చంద్రబాబు పర్యటనలో అవమానం ఎదురైంది. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావును చంద్రబాబు వాహనంలోకి ఎక్కనివ్వలేదు. అలాగే హెలిపాడ్ వద్ద పిచ్చయ్యను చంద్రబాబును కలిసేందుకు అవకాశం కల్పించలేదు. దీంతో నారపుశెట్టి పాపారావు అభిమానులకు విషయం తెలిసి భగ్గుమంటున్నారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి పార్టీలోనే ఉన్న పాపారావును సీఎం వాహనం ఎక్కనివ్వకపోవడం దర్శి నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

జిల్లాకు రిక్త హస్తం చూపించిన బాబు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన బూచేపల్లి వెంకాయమ్మ, మేరుగు నాగార్జున, బత్తుల బ్రహ్మానందరెడ్డి

ఒంగోలు సిటీ: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా ప్రజలకు రిక్తహస్తం చూపించారని దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ జిల్లాకు చంద్రబాబు వస్తుంటే పొగాకు రైతుల కోసం ఏదైనా ప్రకటన చేస్తారేమోనని ఆశగా చూశారని, తీరా సినిమా సెట్టింగ్ వేసుకుని వెళ్లిపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారన్నారు. జిల్లాలో పొగాకు రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్న పరిస్థితి నెలకొని ఉందని, వేలం కేంద్రాల్లో ధర రాకపోవడం, ఎక్కువగా తిరస్కరణ బేళ్లు ఉండటంతో రైతుల పరిస్థితి దారుణంగా ఉందని చెప్పారు. వారిని ఆదుకోవడం మానేసి రైతులకు అన్నీ చేస్తున్నామని అబద్ధాలు చెప్పడం సరికాదన్నారు. సంక్షేమ పథకాలు అందించిన జగన్‌మోహన్‌రెడ్డిని జనం ఒక దైవంలా చూసుకుంటున్నారని, అది చూసి ఓర్వలేక ఆయనపై బురదజల్లే కార్యక్రమాలు చేయడం మంచిది కాదన్నారు. ఎన్నికలప్పుడు సూపర్ సిక్స్‌తో పాటుగా ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రసంగంలో దొనకొండ పారిశ్రామికవాడ ఊసే లేదన్నారు. డిగ్రీ కళాశాల ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. ఇసుక, మట్టి దోపిడీ, మద్యం, రేషన్ బియ్యం మాఫియాలు, తాజాగా చేపలు చెరువుల వద్ద నుంచి వసూలు చేస్తూ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. మీరు సమావేశం పెట్టుకున్న పక్కనే ఒక రైతు ఇంటిపై మీ నియోజకవర్గ ఇన్‌చార్జి దౌర్జన్యానికి పాల్పడిందని, దీనికి మీరు ఏం సమాధానం చెబుతారని చంద్రబాబును ప్రశ్నించారు. పోలీసులను, అధికారులను అడ్డం పెట్టుకుని నియోజకవర్గ ప్రజలను ఇబ్బందులు పెడుతోందన్నారు. రైతులకు మేలుచేసిన రైతు భరోసా కేంద్రాలు తిరిగి పనిచేసేలా చూడాలని బూచేపల్లి డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున మాట్లాడుతూ తల్లికి వందనం కార్యక్రమంలో లక్షలాది మంది లబ్ధిదారులకు డబ్బులు ఇవ్వకుండా ముంచేశారన్నారు. ''నాడు వ్యవసాయం దండుగ అన్నారు. నేడు రైతు పక్షపాతిగా ఉండే ప్రసక్తే లేదు'' అని చంద్రబాబు అంటున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయకుండా మోసం చేశారన్నారన్నారు. వెలుగొండను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. సంక్షేమశాఖ మంత్రి సొంత జిల్లా, చీమకుర్తి పట్టణంలో సంక్షేమ హాస్టల్‌లో ఉంటున్న బాలిక వెంట్రుకలను కోసేశారని, దీనికి మంత్రి ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నెం శ్రీధర్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బెజవాడ రాము, కోటిరెడ్డి, సుధాకర్, ఓబుల్‌రెడ్డి, అన్వేష్, చెంచిరెడ్డి, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఓట్లు కలిగి ఉండటం నేరం

- ఒంగోలు ఆర్‌డీఓ లక్ష్మీ ప్రసన్న

ఒంగోలు సబర్బన్: రెండు ఓట్లు కలిగి ఉండటం చట్ట ప్రకారం నేరమని ఒంగోలు ఆర్‌డీఓ లక్ష్మీ ప్రసన్న అన్నారు. ఒంగోలు ఆర్‌డీఓ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎలక్షన్ కమీషన్ యాక్ట్ ప్రకారం సెక్షన్..31, ఆర్‌పీఏ–1950 ప్రకారం రెండు ఓట్లు కలిగిఉన్న వారిపై ఒక ఏడాది జైలు శిక్ష లేదా లక్ష రూపాయలు జరిమానా విధిస్తారన్నారు. ఆర్‌డీఓ లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతినెలా నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మీటింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నామని తెలిపారు. ఒంగోలు నియోజకవర్గంలో రెండేసి ఓట్లు కలిగిన వారు వెంటనే ఒక ఓటును రద్దు చేసుకోవాలన్నారు. మీరు ఎక్కడైతే నివాసం ఉంటున్నారో అక్కడ మాత్రమే ఓటును కలిగి ఉండాలని తెలిపారు. రెండో ఓటును వెంటనే రద్దు చేసుకోకపోతే కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నేరంగా పరిగణిస్తారన్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. వెంటనే రెండో ఓటును తొలగించుకోవాలని ఒంగోలు నియోజకవర్గంలోని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోని వారు ఆధార్ అనుసంధానం వెంటనే చేసుకోవాలని కోరారు. 18 ఏళ్లు నిండిన యువత ఓట్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఒంగోలు నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లలో 1200 ఓట్ల కంటే ఎక్కువ కలిగిన పోలింగ్ బూత్‌లోని ఓట్లను పక్కనే ఉన్న వేరే పోలింగ్ స్టేషన్‌కు మారుస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో లొకేషన్ చేంజ్ 12 పోలింగ్ బూతులు, కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లు 12 వరకు పెరుగుతాయని మొత్తం పోలింగ్ స్టేషన్లు ఒంగోలు నియోజకవర్గంలో 271 ఏర్పడతాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్ మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో ఎన్నికల నియమ నిబంధనలకు విరుద్ధంగా రెండేసి ఓట్లు కలిగిన ఓటర్లు దాదాపుగా 30 నుండి 35 వేల మంది ఉన్నారని ఇటువంటి ఓటర్ల వల్ల ఎన్నికల వ్యవస్థ మీద ప్రజలకు నమ్మకం పోతుందని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో అన్ని పొలిటికల్ పార్టీల ప్రతినిధులు, అధికారులు ఒంగోలు కృష్ణ మోహన్, సుధాకర్, బాబురావు, రాంభూపాల్ రెడ్డి, పద్మజ, నాయుడు, శేషుబాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.

తిరోగమనం వైపు విద్యా వ్యవస్థ

- కూటమి ప్రభుత్వ విధానాలే కారణం
- బోధనకు దూరమవుతున్న ఉపాధ్యాయులు
- ఫ్యాప్టో ధర్నాలో పలువురు ఉపాధ్యాయ సంఘ నేతల ఆందోళన
- తొలిసారి ఎంఈఓ అసోసియేషన్ సంఘీభావం

ఒంగోలు సిటీ: విద్యా వ్యవస్థను తిరోగమనం వైపు నెడుతున్న కూటమి ప్రభుత్వానికి పతనం తప్పదని ఫ్యాప్టో రాష్ట్ర నాయకత్వం హెచ్చరించింది. ఫ్యాప్టో రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు శనివారం స్థానిక ప్రకాశం భవన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఫ్యాప్టో చైర్మన్ కె.ఎర్రయ్య అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ఉపాధ్యాయ, ఎంఈఓ, పెన్షనర్ల సంఘాల నేతలు పలువురు పాల్గొని మాట్లాడారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను పూర్తిస్థాయి విముక్తులను చేస్తామని, మెరుగైన పీఆర్సీ ఇస్తామని హామీ ఇచ్చిన మంత్రి లోకేష్.. కనీసం ఉపాధ్యాయ సంఘ నేతలకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. ఎంఈఓల రాష్ట్ర సంఘ నేతలు తొలిసారిగా ధర్నాలో పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించగా, ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ ఎస్‌ఎండీ రఫీ ధర్నాను ప్రారంభించారు. ఎంఈఓల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కిషోర్ బాబు మాట్లాడుతూ విద్యార్థులకు పాఠాలు చెప్పడం మానివేసి వారికి పెట్టిన తిండి లెక్కలు తేల్చడానికి ఉపాధ్యాయులు సమయం వెచ్చించాల్సి రావడం విచారకరమన్నారు. ఎంఈఓ, హెచ్‌ఎం, డిప్యూటీ డీఈఓ ప్రమోషన్ల ప్రక్రియలో కామన్ సర్వీస్ రూల్స్ అమలుకు ఉన్న అడ్డంకులు తొలగించాలని డిమాండ్ చేశారు. సీనియర్ ఉపాధ్యాయులచే ఖాళీగా ఉన్న డిప్యూటీ డీఈఓ, డైట్ కాలేజీ లెక్చరర్లు, ఎంఈఓల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసేలా ఉండటం విచారకరమన్నారు. ఉపాధ్యాయులను గిన్నిస్ బుక్ రికార్డు కోసం యోగాంధ్ర, మెగా పీటీఎం వంటి ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలు అమలు చేసే వారుగా మార్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 100 మంది విద్యార్థులున్న ప్రత్యేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు కాపలాదారుగా పనిచేయాల్సి రావడం విద్యా వ్యవస్థకే తీరని అవమానమని అన్నారు. బోధన వ్యవస్థకు ఆటంకం కలిగిస్తున్న యాప్‌లను పూర్తిగా రద్దు చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని, తదితర 19 డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీటీఏ జిల్లా అధ్యక్షుడు పత్రి వెంకట్‌రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను తిరోగమనం వైపు నెడుతోందని దుయ్యబట్టారు. మరో పదేళ్లలో ప్రభుత్వ బడులు లేకుండా చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపాలి...
ఎంఈఓల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగేంద్రవదన్ మాట్లాడుతూ సమాజాన్ని తీర్చిదిద్దే ఉపాధ్యాయులు లేనిదే సమాజం లేదని, అటువంటి ఉపాధ్యాయుల సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపాలని హితవు పలికారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ మంజుల మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులను సీఎం, మంత్రులు నిర్లక్ష్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. హెచ్‌ఎంల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వై.వెంకటరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్కే అబ్దుల్ హై, బి.వెంగళరెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు పీవీ సుబ్బారావు మాట్లాడుతూ ఎంఈఓ–1 పోస్టుల భర్తీకి తీసుకున్న జీవోను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. జెడ్పీ, గవర్నమెంట్ మేనేజ్మెంట్లలో సంయుక్త సీనియారిటీ ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు టీసీహెచ్ సుబ్బారావు, ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కంచర్ల సుబ్బారావు పాల్గొని వారి సంఘాల తరఫున మద్దతు ప్రకటించారు. ఫ్యాప్టో భాగస్వామ్య సంఘాల నాయకులు డి.శ్రీనివాసులు (ఏపీటీఎఫ్–257), బి.వెంకట్రావు(ఏపీటీఎఫ్ 1938), చల్లా శ్రీనివాసులు, ఎస్.రవి, ఎన్.చిన్నస్వామి, వి.మాధవరావు, డి.జయరావు, జీఎండీ సనాఉల్లా, వి.జనార్దనరెడ్డి (ఏపీటీఎఫ్ 257), కె.శ్రీనివాసరావు, పరిటాల సుబ్బారావు, అట్లూరి అమ్మయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

క్లుప్తంగా

నేటి నుంచి రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

ఒంగోలు వన్‌టౌన్: రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుతూ మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ కుప్పం నుంచి శ్రీకాకుళం వరకూ యాత్రను ప్రారంభిస్తున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దళితులపై దాడులు ఎక్కువయ్యాయని, ఎస్సీ వర్గీకరణ అసంబద్ధంగా ఉందని, ఎస్సీ రిజర్వేషన్‌లను జనాభాకు అనుగుణంగా పెంచాలని, ప్రైవేటు రంగాలలో రిజర్వేషన్‌లు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ యాత్ర చేపడుతున్నట్లు వివరించారు. ఈ యాత్రలో దళిత ఉద్యోగులు, నాయకులు, విద్యావంతులు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడి మృతి

చీరాల రూరల్: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందినట్లు చీరాల జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య తెలిపారు. చీరాల–స్టూవార్టుపురం రైల్వేస్టేషన్ల మధ్య ఎగువ, దిగువ లైన్ల మధ్య ఓ యువకుడు మృతి చెందాడనే సమాచారంతో సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. మృతుడికి 25 ఏళ్లుంటాయని, ఎటువంటి సమాచారం లభించలేదని పేర్కొన్నారు. గుర్తుతెలియని రైల్లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉంటాడనే అనుమానాన్ని ఎస్సై వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం చీరాల ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జగన్ 2.0లో కార్యకర్తలకే ప్రాధాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వేదికపై జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాజీ మంత్రి మేరుగు నాగార్జున


బాబూ ష్యూరిటీ - మోసం గ్యారంటీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, మేరుగు నాగార్జున, నాయకులు


బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, మేరుగు నాగార్జునను సన్మానిస్తున్న నాయకులు

- వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశంలో బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వెంకాయమ్మ, మేరుగు నాగార్జున
- పొగాకు రైతులపై కేసులు పెట్టిన చంద్రబాబు.. ఇప్పుడు అన్నదాత సుఖీభవ అంటున్నాడని ధ్వజం

చీమకుర్తి: టీడీపీ, బీజేపీ, జనసేనతో పాటు ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా 2029లో ముఖ్యమంత్రి అయ్యేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ చీమకుర్తి మండల స్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. బూచేపల్లి శివప్రసాదరెడ్డితో పాటు పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ 2029లో కాబోయే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2.0 పరిపాలనలో పార్టీ నాయకులు, కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యం ఇస్తారంటూ కార్యకర్తలలో ఉత్సాహాన్ని నింపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తన సొంత జిల్లాను వదిలిపెట్టి సంతనూతలపాడు నియోజకవర్గానికి వచ్చిన మేరుగు నాగార్జునను వచ్చే ఎన్నికలలో ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబు మొసలి కన్నీరు కారుస్తున్నారు...

మేరుగు నాగార్జున మాట్లాడుతూ పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలిలో నిర్వహించిన కార్యక్రమానికి 50 వేల మంది రైతులు హాజరైతే.. వారిపై చంద్రబాబు ప్రభుత్వం కేసులు పెట్టిందని, కానీ, ఇప్పుడు వచ్చి అన్నదాత సుఖీభవ అంటూ రైతుల పట్ల చంద్రబాబు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశాడు. ఎన్నికలప్పుడు సూపర్ సిక్స్ పథకాలతో పాటు 134 హామీలతో ప్రజలను మోసం చేసి చంద్రబాబు సీఎం అయ్యారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా కాలంలో ప్రజలకు పార్టీలకతీతంగా ఎన్ని సంక్షేమ పథకాలు ఇచ్చారో, ఇప్పుడు చంద్రబాబు ఏడాది పాలనలో ఎన్ని సంక్షేమ పథకాలు ఇచ్చారో తేల్చుకుందామని, బహిరంగ చర్చకు సిద్ధమా..? అని కూటమి నేతలకు సవాల్ విసిరారు. జగన్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను గడప గడపకు అందిస్తే ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. ఇప్పుడు చంద్రబాబు పథకాలేమీ అమలు చేయకుండానే సుపరిపాలనకు తొలి అడుగు అంటూ ప్రజల్లో వెళ్తే ప్రజలు మొహం చాటేస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్ పిలుపు మేరకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ పేరుతో సంతనూతలపాడు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ సూపర్ సిక్స్, ఆడబిడ్డ నిధి పథకాలను ఎగ్గొట్టి ప్రజలను చంద్రబాబు మోసం చేశారని మండిపడ్డారు. సమావేశం అనంతరం బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీకి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, మేరుగు నాగార్జునను పార్టీ నాయకులు గజమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, పార్టీ చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మండల రూరల్ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, నాయకులు గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ అవార్డులకు 8 లోపు దరఖాస్తులు

ఒంగోలు సిటీ: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించనున్న ఉపాధ్యాయ దినోత్సవంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకునేందుకు అర్హులైన వారి నుంచి ఈ నెల 1 నుంచి 8వ తేదీ వరకు, జిల్లాస్థాయిలో 2వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీఈఓ కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా, జిల్లాస్థాయిలో ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. జిల్లాపరిషత్, మండల పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మోడల్ స్కూల్స్, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, గురుకులాలు, కేజీబీవీలు, డైట్ కాలేజీ, ఏపీ గురుకులాల మేనేజ్‌మెంట్లలోని టీచర్లకు ఈ అవార్డులు అందించనున్నట్లు వివరించారు. లీప్ యాప్‌లో నమోదైన వివరాలు, పని తీరు ఆధారంగా ఉపాధ్యాయులకు అవార్డులు ఇస్తారన్నారు. డివిజన్ స్థాయిలో 11వ తేదీ పరిశీలించి ఒక్కో కేటగిరీకి ముగ్గురు చొప్పున తొలుత ఎంపిక చేస్తారని తెలిపారు. అనంతరం ఒక్కో కేటగిరికి ఒకరు చొప్పున ఎంపిక చేసి తుది జాబితాతో ఈ నెల 14వ తేదీ జిల్లాస్థాయి కమిటీని రూపొందిస్తారని వివరించారు. ఈ జాబితాను 16న పాఠశాల విద్యాశాఖ డైరెక్టరు కార్యాలయానికి పంపిస్తారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో 21 నుంచి 23వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి తుది జాబితాను 25వ తేదీ ఖరారు చేస్తారన్నారు. ఎంపికైన వారికి సెప్టెంబరు 5వ తేదీ రూ.20 వేల నగదు, ప్రశంసపత్రం అందిస్తారన్నారు. జిల్లాస్థాయిలో 30 మంది ఎస్జీటీలు, 20 మంది స్కూల్ అసిస్టెంట్లు, 10 మంది హెడ్‌మాస్టర్లకు మించకుండా అవార్డులకు ఎంపిక చేయాలని డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు తెలిపారన్నారు. జిల్లాకు 16 మంది చొప్పున రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసి ఆ జాబితాను జిల్లాలకు పంపిస్తారన్నారు. ఇంటర్వ్యూ ఆధారంగా 104 మందిని ఎంపిక చేస్తారన్నారు. ఈ నెల 8వ తేదీ లోగా ఒంగోలు, మార్కాపురం డివిజన్ల ఉప విద్యాశాఖాధికారుల కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

భార్య గొంతు కోసిన భర్త

- కుటుంబ కలహాల నేపథ్యమే కారణం


భర్త దాడిలో గాయపడిన మల్లేశ్వరి


కుటుంబ సభ్యులను విచారిస్తున్న పోలీసులు

పెద్దదోర్నాల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ భర్త తన భార్య గొంతు కోశాడు. ఈ సంఘటన మండల పరిధిలోని పెద్దబొమ్మలాపురం పడమటపల్లెలో శనివారం జరిగింది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన వివాహిత మల్లేశ్వరి తీవ్రంగా గాయపడింది. స్థానికుల సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రురాలిని 108లో మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని పెద్ద బొమ్మలాపురానికి చెందిన స్వేచ్ఛ కుమార్, మల్లేశ్వరి దంపతులు. స్వేచ్ఛకుమార్ గతంలో కొన్నాళ్లు హోంగార్డుగా విధులు నిర్వహించాడు. కొన్ని కారణాల రీత్యా విధుల నుంచి పోలీసు అధికారులు తప్పించారు. ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో దంపతుల మధ్య విభేదాలు తలెత్తాయి. ఆమె అదే గ్రామంలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లి అక్కడే ఉంటోంది. గ్రామ సమీపంలో ఉన్న కొండ వద్దకు బహిర్భూమికి వెళ్లిన మల్లేశ్వరిని అటకాయించిన స్వేచ్ఛ కుమార్ కత్తితో ఆమె గొంతు కోసి పరారైనట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

విద్యుదాఘాతానికి రైతు బలి


చెన్నారెడ్డి మృతదేహం

పొదిలి రూరల్: పొలంలో వ్యవసాయ విద్యుత్ బోరుకు సంబంధించిన పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. ఈ సంఘటన పొదిలి మండలం అన్నవరంలో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యర్రంరెడ్డి చెన్నారెడ్డి (55) తన పొలంలో ఉన్న విద్యుత్ బోరుకు మరమ్మతులు చేస్తున్నాడు. బోరులోకి పైపులు దించే క్రమంలో పైన పొలాలకు సరఫరా చేసే 11కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు చెన్నారెడ్డికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పొదిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జగన్ పర్యటనను అడ్డుకుంటే శిక్ష తప్పదు

- వైఎస్సార్ సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి


మాట్లాడుతున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను కూటమి ప్రభుత్వం అడ్డుకుంటే ప్రజాకోర్టులో వారికి శిక్ష తప్పదని వైఎస్సార్ సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి హెచ్చరించారు. శనివారం మార్కాపురంలో మీడియాతో ఆయన మాట్లాడారు. నెల్లూరు జిల్లాలో వైఎస్ జగన్ పర్యటనకు ప్రజలు స్వచ్ఛందంగా భారీగా తరలిరాగా, అడ్డుకునేందుకు కూటమి సర్కారు చేసిన కుట్రలు అప్రజాస్వామికమని అన్నారు. ఇది పూర్తిగా ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చర్య అంటూ తీవ్రంగా ఖండించారు. ప్రజల్లోకి వెళ్లే స్వేచ్ఛ ప్రతి నాయకునికి ఉంటుందన్నారు. తమ అభిమాన నేత పర్యటనకు వెళ్లే పూర్తి అధికారం స్వేచ్ఛ ప్రజలకు కూడా ఉంటుందని ఆయన గుర్తుచేశారు. ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్న కూటమి సర్కార్.. జగన్‌ను, ప్రజలను అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. జగన్ పర్యటనను ఎంత అడ్డుకుంటే ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై అంత కోపం పెరుగుతుందని హెచ్చరించారు. దీని ఫలితం వచ్చే ఎన్నికల్లో కూటమి సర్కార్ అనుభవించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికైనా కూటమి సర్కార్ ఇటువంటి ప్రజా వ్యతిరేక చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. కూటమి సర్కార్ తీరులో మార్పు రాకపోతే ప్రజలే ఆ ప్రభుత్వాన్ని మారుస్తారన్నారు. వైఎస్ జగన్ తన ఐదేళ్ల పదవీ కాలంలో ప్రజలకు ఏం చేశారని కూటమి సర్కార్ పెద్దలు హాస్యాస్పదంగా ప్రశ్నిస్తున్నారని, జగన్ ఏం చేశారో జనంలోకి వెళ్లి అడిగే దమ్ము ఈ ప్రభుత్వ పెద్దలకు ఉందా.? అని జంకె సవాల్ విసిరారు. తన పాలనలో మూడేళ్లు కరోనా ఉన్నప్పటికీ ఆర్థిక వ్యవస్థ ఇబ్బందిగా మారినప్పటికీ పేదల సంక్షేమాన్ని వదలకుండా అనేక పథకాలను వైఎస్ జగన్ అమలు చేసిన విషయం ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని అన్నారు. ఈ విషయం కూటమి ప్రభుత్వంలోని పెద్దలకు కూడా తెలుసన్నారు. ఈ విషయాన్ని గమనించిన కూటమి పెద్దలు.. జగన్ జనంలోకి వెళితే ప్రభుత్వంపై వ్యతిరేకత రావడంతో పాటు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుస్తుందన్న భయంతో జగన్ పర్యటనను అడుగడుగునా అడ్డుకుంటున్నారని జంకె విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ పెద్దలు ఇటువంటి విధానాలను విడిచిపెట్టాలని ఆయన హితవు పలికారు.

గొర్రెలు, మేకల పెంపకం సంఘానికి అన్యాయం


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి పెద్దబ్బాయి

సంతమాగులూరు (అద్దంకి): కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా గొర్రెలు, మేకల పెంపకం సంఘానికి రూపాయి కేటాయించలేదని గొర్రెలు, మేకల సంఘ రాష్ట్ర కార్యదర్శి పెద్దబ్బాయి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘ 7వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి పిలుపునిచ్చారు. అందులో భాగంగా శనివారం బాపట్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని కొప్పెరపాడు, ఎస్ఎల్ గుడిపాడు, ఎంకే పాలెం, మామిళ్లపల్లి తదితర గ్రామాల్లో పర్యటించి మహాసభల కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆగస్టు 17 ,18వ తేదీల్లో ఒంగోలులో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వృత్తి రక్షణ, వృత్తిదారుల సంక్షేమం కోసం మహాసభల్లో రాష్ట్ర వ్యాప్తంగా పెంపకందార్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి సమగ్ర కార్యాచరణ ప్రకటించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయానికి అనుబంధంగా గొర్రెల పెంపకం ప్రధానమైన జీవనాధారంగా ఉందని గుర్తుచేశారు. రాష్ట్రంలో రెండు కోట్ల 21 లక్షల గొర్రెలు, మేకల సంపద, ఐదు వేలకు పైగా పెంపకందార్ల సహకార సంఘాలు, సుమారు నాలుగు లక్షల కుటుంబాలకుపైగా ఈ రంగంపై ఆధారపడి బతుకుతున్నాయన్నారు. గ్రామీణ స్థాయి సొసైటీల్లో జిల్లా స్థాయిలో యూనియన్లు, రాష్ట్రాల్లో ఫెడరేషన్ ఏర్పాటు చేసినా వాటికి తగిన నిధులు ప్రభుత్వాలు కేటాయింపులు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ సమాజానికి బలమైన నాణ్యమైన, పౌష్టికాహారం అందిస్తున్న కీలకమైన రంగాన్ని ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం అన్యాయన్నారు. బీమా పథకాలు సరిగా అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫారెస్ట్ అధికారులు గొర్రెలను అడవిలోకి రానివ్వకపోయినా పశువుల పోరంబోకు భూములు, కుంటలు, దారులు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మందులు, టీకాలు, డీ వార్మింగ్ కోసం బడ్జెట్లో నిధులు పెంచాల్సిన అవసరం ఉందని, నా బార్డు ద్వారా 50 శాతం సబ్సిడీ రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి తోట తిరుపతిరావు, రాష్ట్ర బాధ్యులు పూసపాటి వెంకట్రావు, బాపట్ల జిల్లా సంఘ కార్యదర్శి బుర్రి ఆంజనేయులు, చిమట సైదులు, పెద సింగరయ్య పాల్గొన్నారు.